క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం గోవిందా నామస్మరణంతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో నిత్యాన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. శనివారం మేఘన కౌశిక్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు. వీరు ప్రతి నెల 8న ఆలయంలో అన్నదానం చేసేందుకు ముందుకొచ్చినట్లు సాయి దీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

రామోజీరావు మృతికి సంతాపం

నిర్మల్‌చైన్‌గేట్: రామోజీరావు మృతి పట్ల బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తన నివాసంలో, కాంగ్రెస్ నాయకులతో కలిసి మౌనం పాటించి వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



పొట్టపెల్లిలో స్తంభం వేయిస్తున్న ఏఈ మహేశ్

సాక్షి స్పందన

లక్ష్మణచాందా: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ చేన్లలో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో ఈనెల 2న సాక్షిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ ఏఈ మహేశ్ స్పందించారు. శనివారం మండలంలోని పొట్ట పెల్లి(కె), పీచర శివార్లలో వ్యవసాయ భూముల్లో ఏఈ.. సిబ్బందితో నాలుగు విద్యుత్ స్తంభాలు వేయించి తీగలను సరిచేశారు.

లక్ష్మణచాంద ఎస్సైగా సుమలత

లక్ష్మణచాందా: లక్ష్మణచాంద నూతన ఎస్సైగా సుమలత నియమితులయ్యారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై సారంగాపూర్ మండలానికి వెళ్లగా నిర్మల్‌రూరల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బి.సుమలత లక్ష్మణచాందకు వచ్చారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన ఎస్సైకి సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

సారంగాపూర్ ఎస్సైగా శ్రీకాంత్

సారంగపూర్: సారంగాపూర్ ఎస్సైగా సల్ల శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసే చంద్రమోహన్ బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు. అసెంబ్లీ ఎన్నికల వేళ మండలానికి వచ్చిన ఎస్సై చంద్రమోహన్ పార్లమెంటు ఎన్నికల ఫలితాల అనంతరం తిరిగి బదిలీపై వెళ్లారు. రాజకీయ ప్రమేయంతోనే బదిలీ జరిగినట్లు మండలవాసులు చర్చించుకుంటున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో మహాగణపతి శ్రీ లక్ష్మీనరసింహ దత్త సాయి ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కొరిపెల్లి దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామి వారి కల్యాణం, ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

జాతరకు తరలిరావాలి



అమ్మవారు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మదేవి జాతర (తీర్థం)ను ఆదివారం నిర్వహించనున్నారు. ఏటా మృగశిర కార్తె జ్యేష్ఠ మాసంలో మొదటి ఆదివారం తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర సందర్భంగా భక్తులు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యంగా ఓమ, ఉల్లిగడ్డలు, పేలాలు, పుట్నాలు నైవేద్యంగా సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత. అనంతరం బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

అందని ద్రాక్షగా ‘డబుల్’ ఇళ్లు

- కడెంలో రెండేళ్ల కిందట పూర్తయిన నిర్మాణాలు
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



పెద్దూర్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

కడెం: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని విధంగా మారింది కడెం మండలకేంద్రంలోని పెద్దూర్ సమీపంలో నిర్మించిన 200 డబుల్ బెడ్‌రూం ఇళ్ల దుస్థితి. గత ప్రభుత్వంలో నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అన్ని హంగులతో నిర్మించిన ఇళ్లను మాత్రం లబ్ధిదారులకు పంపిణీ చేయడం లేదు.

రెండేళ్ల కిందట పూర్తి..

గత ప్రభుత్వ హయాంలో కన్నాపూర్, కడెం గ్రామాల ప్రజల కోసం 2020లో మండల కేంద్రంలోని పెద్దూర్ సమీపంలో 200 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్ల కిందట పూర్తి చేశారు. ఇళ్ల పంపిణీ చేసేందుకు అధికారులు గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇంటింటికీ వెళ్లి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. జాబితాలో అనర్హులున్నారని.. మళ్లీ రీసర్వే నిర్వహించి తుది జాబితాను సిద్ధం చేసినా పంపిణీ జరగలేదు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

ఎన్నికల కోడ్ ముగియడంతో..కొత్త ప్రభుత్వంలోనైనా తమకు ఇళ్లు దక్కుతాయనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బొజ్జు చొరవ చూపి లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని వేడుకుంటున్నారు.

పెండింగ్‌లో పనులు

రూ.పది కోట్ల వ్యయంతో 200 ఇళ్లను అపార్ట్‌మెంట్ మోడల్‌లో నిర్మించారు. కానీ కొన్ని పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇళ్లలో సీసీ రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ, నీటి సౌకర్యం కల్పించలేదు.

లిస్ట్‌లో పేరుంది



డబుల్‌బెడ్ రూం ఇంటి కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్నా. అధికారులు మా ఇంటికి వచ్చి సర్వే చేశారు. లబ్ధిదారుల తుది జాబితాలో మా పేరుంది. కానీ ఇంటిని పంపిణీ చేయడం లేదు. మాకు ఇబ్బంది అవుతుంది.

– పూస కమల, పెద్దూర్

కిరాయి ఇంట్లో ఉంటున్నాం



కొన్నేళ్లుగా నా కుటుంబంతో కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఇళ్లు పూర్తయినప్పటికీ పంపిణీ చేస్తలేరు. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి అర్హులకు ఇళ్లను కేటాయించాలి.

– శ్రీకాంత్, కడెం

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు

కడెంలో రూ.పది కోట్లతో 200 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించాం. నిధులు మంజూరు కాకపోవడంతో రోడ్లు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదు. లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేసే విషయమై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– లవకుమార్, పీఆర్ ఏఈఈ

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



సోన్: గంజాల్‌లో బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

భైంసాటౌన్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నాలుగో వార్డు కౌన్సిలర్ చందూలాల్ అన్నారు. పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఏపీ నగర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కారు బడుల్లో అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం గురించి అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఐఈఆర్‌పీలు నరేశ్, సునీల్ ఉన్నారు.

భైంసారూరల్: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ముత్యంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చింతల్‌బోరిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లు నిండినవారిని పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు కృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌బాబు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రమీలా, ఎంపీటీసీ ఫక్రుద్దీన్, మాజీ సర్పంచ్ మొహినొద్దీన్, ముత్తన్న, నర్సయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



భైంసారూరల్: చింతల్‌బోరిలో..



భైంసాలో బడిబాటలో ఉపాధ్యాయులు

కుంటాల: నాణ్యమైన విద్య అందిస్తున్న సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ ముత్యం పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్‌తోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎల్లన్న, రాజేశ్వర్, గిరినాథ్, లక్ష్మణ్, సబ్బిడి నర్సయ్య తదితరులు ఉన్నారు.



కుంటాల: పెంచికల్‌పాడ్‌లో..

‘దారి’ద్ర్యం పోయేదెన్నడు..

- ఖానాపూర్‌లో ఇరుకురోడ్లతో ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



డివైడర్‌ను ఢీకొట్టిన కారు



జగన్నాథ్‌రావు చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య

ఖానాపూర్: పట్టణంలో రోడ్డు వైడింగ్ (విస్తరణ) పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు నానా వస్థలు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరించకుండా మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారడంతో ఖానాపూర్‌లో ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారింది. తర్వాత అసెంబ్లీ ఎన్నికలను సాకుగా చూపి పనులు చేపట్టలేదు.

గతంలో జరిగిన ప్రమాదాలు..

పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. దీంతో ఈ రోడ్డు పరిధిలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన ఒకరు పోస్టాఫీసు వద్ద డివైడర్‌ను ఢీకొని మృతి చెందారు. జగన్నాథ్ చౌరస్తాలోని డివైడర్‌ను పలువురు వాహనదారులు ఢీకొని గాయపడ్డారు.

రెండేళ్ల కిందట రూ.15కోట్లతో పనులు..

ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బంది పడకుండా పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వైడింగ్ పనులు చేపట్టేందుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. అందులో భాగంగా 2022 ఏప్రిల్‌లో పనులు ప్రారంభించారు. కానీ బాబా ఆలయం నుంచి తిమ్మాపూర్ ఎస్‌బీఐ(బ్యాంకు) వరకు మాత్రమే పనులు పూర్తి చేశారు. కనీసం 50శాతం పనులు కూడా సక్రమంగా పూర్తి చేయలేదు. ఇప్పటివరకు రూ.5 కోట్ల మేర పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మరో రూ.10 కోట్లతో పనులు చేయాల్సి ఉంది. దీనికి తోడు డివైడర్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

నాణ్యతలోపంతోనే..

ఇప్పటివరకు చేసిన పనులు నాణ్యత లోపంగానే దర్శనమిస్తున్నాయి. గతేడాది వర్షం కురుస్తుండగానే పనులు చేపట్టారు. దీంతో చిన్నపాటి వర్షానికే పట్టణంలో రోడ్లన్నీ కుంటలను తలపిస్తున్నాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో సమస్య మరింత జఠిలం కానుంది. అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్లపై గుంతలతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీనిపై అధికారులు, పాలకవర్గం వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిగ్నల్ వ్యవస్థ లేక ఇక్కట్లు..

ఖానాపూర్ పట్టణంలో ప్రధానంగా జగన్నాథ్‌రావు చౌరస్తాతో పాటు ఎన్టీఆర్ చౌరస్తా, కుమురం భీం చౌరస్తా ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. జగన్నాథ్ చౌరస్తాలో మెట్‌పల్లి, నిర్మల్-ఖానాపూర్ వెళ్లే కూడలి కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఎన్టీఆర్ చౌరస్తాలో ఖానాపూర్-నిర్మల్, కడెం-మంచిర్యాల వెళ్లే మార్గం కావడంతో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. కుమురం భీం చౌరస్తాలో కడెం-మంచిర్యాల, ఖానాపూర్-నిర్మల్ వెళ్లే త్రిముఖ కూడలి ఉండడంతోపాటు ప్రధానంగా నిర్మల్, ఖానాపూర్ హైవే పనులు జరుగుతుండడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. ఆయా చోట్ల ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే పనులు చేపడతాం

పట్టణంలో ఇప్పటివరకు రోడ్డు వైడింగ్ పనులు చేసిన వారికి రూ.5కోట్ల మేర బిల్లుల చెల్లిస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మిగిలిన పనులు చేపడుతాం. ఎన్నికల కోడ్ ముగియడంతో పాలకవర్గంతో చర్చించి చర్యలు చేపడతాం.

– మనోహర్, మున్సిపల్ కమిషనర్

ఇరుకురోడ్లతో ప్రమాదాలు

పట్టణ పరిధిలో రోడ్డు వైడింగ్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డివైడర్లను ఢీకొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా వైడింగ్ పనులను పూర్తి చేయాలి.

– శ్రీనివాస్, ఖానాపూర్

బోర్లు ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తీర్చేందుకు శనివారం ఎమ్మెల్యే నిధులతో బోర్లు వేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బొజ్జు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో వారు నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్, రంగపేట రాజరాజేశ్వర ఆలయం, కోలాంగు దేవునిగూడెం గ్రామాల్లో బోర్లు వేశారు.

ఉన్నతంగా రాణించాలి

భైంసాటౌన్: విద్యార్థులు కష్టపడి ఉన్నతంగా రాణించాలని శ్రీ సరస్వతి విద్యాపీఠం విభాగ్ అధ్యక్షులు డా. దామోదర్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు పెండెపు కాశీనాథ్ కూతురు శ్రీజ ఇటీవలి నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించింది. శనివారం స్థానిక గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శ్రీజను సత్కరించారు. పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు డా.నగేశ్, నూకల సురేశ్, గోపాల్‌కిషన్, సుదర్శన్, దత్తురాం పటేల్, రాజ్‌గంగాధర్, దేవేందర్ ఉన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి మౌనిక

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆయిల్‌పాం రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుఖర్చులు, ప్రభుత్వం ఇచ్చే రాయితీ, తెగుళ్ల నివారణకు చర్యలు, ఇతర యాజమాన్య పద్ధతులను ఉద్యానశాఖ క్లస్టర్ అధికారిణి సాదుల మౌనిక వివరించారు. ఆయిల్‌పాం మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రియూనిక్ కంపెనీ జిల్లా జనరల్ మేనేజర్ మల్లేశ్వర్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రియూనిక్ కంపెనీ ఒప్పంద పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వనోజ్‌రెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

చేప మందు పంపిణీకి స్పందన



బారులు తీరిన జనం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో సగ్గం సోదరులు కృష్ణ, లింగం శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పంపిణీ చేసిన చేప మందు స్వీకరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. స్థానికంగా చేపపిల్లలు దొరకకపోవడంతో గ్రామపెద్దలు కరీంనగర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించి చేపమందు పంపిణీ ప్రక్రియ చేపట్టారు. స్థానిక మత్స్యకారులు సైతం చెరువుల్లోంచి కొన్ని చేపపిల్లలను తీసుకొచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన చేపమందు పంపిణీ సాయంత్రం వరకు కొనసాగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇబ్బంది కల్గకుండా శామియానాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. చేపమందు స్వీకరిస్తే ఆస్తమా, ఉబ్బసం వ్యాధులు తగ్గుతాయని ప్రజల విశ్వాసం.

బాధిత కుటుంబాలకు పరామర్శ



తానూరు: ఎల్వత్‌లో బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మోహన్‌రావ్‌పటేల్



సారంగపూర్: దుర్గానగర్‌లో ధైర్యం చెబుతున్న కాంగ్రెస్ నాయకులు సుగుణ, శ్రీహరిరావు

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు కొందపురం రాజశేఖర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబసభ్యులను మున్నూరుకాపు సంఘం ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు రోళ్ల రమేశ్ పరామర్శించారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, రాజేశ్వర్, భోజన్న, చిన్నయ్య, దేవేందర్, నాలం గంగాధర్, కారడిరి గంగాధర్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వత్‌లో కవిత –సాయినాథ్ దంపతుల కుమారుడు శ్రీ అనే బాలుడు ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందగా.. బాధిత కుటుంబసభ్యులను శనివారం బీజేపీ నాయకులు, మోహన్‌రావ్ ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావ్‌పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి తన వంతుగా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. నాయకులు జ్ఞానేశ్వర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని దుర్గానగర్‌కు చెందిన జాదవ్ పండిత్ కుమారుడు జాదవ్ కృష్ణ(14) అనే బాలుడు ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందిన విషయం విదితమే. శనివారం బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఇటీవల ఎంపీగా పోటీ చేసి ఓడిన ఆత్రం సుగుణ పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి వెంట జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ నర్సయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణారెడ్డి, ఆది, నవీన్ రెడ్డి, తేజు, నక్క రాజన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ నాళం శ్రీనివాస్, మదన్‌మోహన్ తల్లి భోజమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను మున్నూరు కాపు సంఘ తాలూకా సభ్యులు పరామర్శించారు. ఆ సంఘం తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేశ్, సభ్యులు చిన్నన్న, పోశెట్టి, న్యాయవాది నరేశ్, మోహన్, సాయన్న, లింగన్న, రాజేశ్వర్, భూమయ్య, గంగాధర్, దేవేందర్ ఉన్నారు.

వరద రాకుండా చర్యలు చేపట్టాలి



జేకేనగర్ శివారులో తాత్కాలిక కందకం పరిశీలిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లోకి అటవీ ప్రాంతం నుంచి వరద రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని జేకేనగర్ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న ముంపు ప్రభావిత చెక్‌డ్యాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు ముందస్తుగా చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలన్నారు. కందకాలు తవ్వి చర్యలు తీసుకుంటేనే వరద ప్రభావం లేకుండా చూడవచ్చని కాలనీ వాసుల సమక్షంలో అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో యూసుఫ్‌ఖాన్, రాములు, వెంకటేశ్, రాజు, మల్లేశ్, సాగర్ తదితరులు ఉన్నారు.

ఉప్పొంగిన ‘భగీరథ’



రోడ్డుపై వృథాగా పోతున్న నీరు



ఎగిసిపడుతున్న భగీరథ జలం

భైంసాటౌన్: పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ దెబ్బతినడంతో ఒక్కసారిగా నీరు పైకి ఎగజిమ్మింది. శనివారం సాయంత్రం ఓ ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్ ఎయిర్‌వాల్వ్‌ను ఢీకొనడంతో పైప్ విరిగిపడింది. దీంతో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోయింది. ఆ మార్గంలో వెళ్లేవారంతా ఎగిసి పడుతున్న నీటి దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. స్థానికులు భగీరథ గ్రిడ్ అధికారులకు సమాచారమివ్వగా వారు నీటి సరఫరా నిలిపేశారు.